క్లుప్తంగా

వీరభద్రుడికి వైభవంగా బోనాల సమర్పణ


వీరభద్రుడి బోనాల సందర్భంగా భక్తుల ఊరేగింపు

రాయవరం: శైవభక్తుల వీరభద్ర నామస్మరణతో రాయవరం మార్మోగింది. రాయవరంలో సోమవారం వీరభద్రుడికి వైభవంగా భక్తులు బోనాలు సమర్పించారు. వీరభద్రుడు, వీరగని కమ్మ ప్రతిమలను, విభూతిపండును శిరస్సులపై ధరించి శైవభక్తులు గ్రామంలో ఊరేగింపు కొనసాగించారు. ప్రత్యేక వాయిద్యాలతో భక్తులు గ్రామోత్సవం నిర్వహించిన అనంతరం జమ్మిచెట్టు వద్ద పూజాదికాలు నిర్వహించారు. అనంతరం స్థానిక తుల్యభాగ నదీతీరాన ఉన్న వీరభద్రుడి గద్దె వద్దకు వెళ్లి అత్యంత భక్తిశ్రద్ధలతో బోనాలు సమర్పించారు. రాయవరం, వెదురుపాక, వి.సావరం, మహేంద్రవరం, కొమరిపాలెం, లొల్ల, సోమేశ్వరం తదితర గ్రామాల నుంచి వచ్చిన భక్తులు వీరభద్రుడి బోనాల ఊరేగింపులో పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

రామచంద్రపురం: పట్టణంలోని 33/11 కేవీ సబ్‌స్టేషన్ ఫీడర్ మరమ్మతుల నిమిత్తం మంగళవారం పట్టణంలో పలుచోట్ల విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు రామచంద్రపురం డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కె.విజయనంద సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ మెయిన్ రోడ్డు, రత్నంపేట, గుబ్బలవారి పేట, హౌసింగ్ బోర్డు, ముచ్చుమిల్లి, లలితానగర్, వీఎస్ఎం కాలేజీ, గవర్నమెంట్ హాస్పిటల్, మోడరన్ కాలేజ్, రామకృష్ణ సెంటర్, బ్రాడీపేట, మార్కెట్ సెంటర్, గవర్నమెంట్ హాస్పిటల్, గాంధీ హాస్పిటల్, ముచ్చిమిల్లి రోడ్డు, కమ్మవారి సావరం, ఆర్డీఓ కార్యాలయం, కవలవారిసావరం, మధ్యనగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని తెలిపారు. వినియోగదారులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

ఆధ్యాత్మికతకు ప్రతీకలు ఆలయాలు

కపిలేశ్వరపురం: భారతీయ ఆలయాలు ఆధ్యాత్మికతకు ప్రతీకలుగా నిలుస్తాయని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అన్నారు. మండలంలోని మాచరలో సోమవారం నూతనంగా నిర్మించిన కోదండ రామాలయంలో దేవతామూర్తుల విగ్రహ ప్రతిష్ఠాపనా కార్యక్రమానికి ఎమ్మెల్సీ తోట హాజరయ్యారు. స్వామిని దర్శించుకున్నారు. ఆయన వెంట వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ శీలం గోవింద్, గ్రామ కమిటీ అధ్యక్షులు వాసంశెట్టి విష్ణు, ఇతర ప్రజాప్రతినిధులు ఉన్నారు.

సమావేశాన్ని విజయవంతం చేయండి

రామచంద్రపురం రూరల్: ఏలూరులో మంగళవారం బీజేపీ పోలింగ్ బూత్ కార్యకర్తలతో కేంద్ర హోం శాఖా మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ నిర్వహిస్తున్న సమీక్ష సమావేశాన్ని విజయవంతం చేయాలని ఆ పార్టీ అమలాపురం పార్లమెంట్ జిల్లా కన్వీనర్ ఇళ్ల సత్యనారాయణ పిలుపునిచ్చారు. ద్రాక్షారామలో బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ దూడల శంకరనారాయణ నేతృత్వంలో జరిగిన సమావేశంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పార్టీ రూరల్ మండల అధ్యక్షుడు ఆకేటి శ్రీకృష్ణ, జిల్లా బిల్డింగ్ వర్కర్స్ కోకన్వీనర్ అల్లం రామకృష్ణ, సౌత్ జోన్ రైల్వే బోర్డు మెంబర్ పెయ్యల రాంబాబు, దేవ్ పట్టాభి పాల్గొన్నారు.

మండల సమాఖ్య అధ్యక్షురాలిపై ఫిర్యాదు

రామచంద్రపురం రూరల్: రామచంద్రపురం మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు వాసంశెట్టి లావణ్యపై స్పందన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు ఎంపీపీ అంబటి భవాని సోమవారం విలేకరులకు తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా ఆమె అధ్యక్షురాలిగా కొనసాగుతుందని, ఆమెపై ఉన్న అభియోగాలపై విచారణ చేయాలని కలెక్టర్‌ను కోరినట్లు ఎంపీపీ వివరించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

కాజులూరు: కాకినాడ– కోటిపల్లి రహదారిలో జగన్నాథగిరి వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం.. కాకినాడ ప్రతాప్‌నగర్‌కు చెందిన సింగనపల్లి సుబ్రహ్మణ్యం తన బైక్‌పై ద్రాక్షారామ వెళ్తున్నారు. జగన్నాథగిరి కెనాల్ రోడ్డు వద్దకు వచ్చేసరికి ఎదురుగా వస్తున్న లారీని తప్పించబోయి రోడ్డుపక్కన ఉన్న పంట కాలువలోకి బైక్‌తో సహా పల్టీ కొట్టాడు. అటుగా వెళ్తున్న ప్రయాణికులు గమనించి బాధితుడిని చికిత్స నిమిత్తం కాకినాడ ఆసుపత్రికి తరలించారు.

20 లీటర్ల సారా పట్టివేత

కపిలేశ్వరపురం: కేదారిలంక గ్రామ శివారు వీధివారిలంక భూముల్లో చిట్టూరి శ్రీనివాస్ అనే వ్యక్తి సారా కలిగిఉన్నట్టు అందిన సమాచారంతో ఆదివారం రాత్రి అంగర పోలీసులు దాడి చేశారు. 20 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు శ్రీనివాస్‌ను ఆలమూరు జేఎఫ్‌సీఎం కోర్టుకు తరలించగా, రిమాండ్‌కు ఆదేశించినట్టు ఎస్సై అందే పరదేశీ సోమవారం తెలిపారు.

అన్నదాత వెన్నంటే..

- 2021-22 రబీ, 2022 ఖరీఫ్ నిధుల విడుదల
- 17,222 మంది రైతులకు రూ.2.32 కోట్ల లబ్ధి
- 28న ఖాతాలకు చేరనున్న వైఎస్సార్ సున్నా వడ్డీ సొమ్ము



రాయవరం/కపిలేశ్వరపురం: వ్యవసాయాన్ని పండగ చేయాలన్న సంకల్పంతో.. అన్నదాతల సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విత్తు నుంచి పంట విక్రయాల వరకు అన్నింటా అండగా ఉంటున్నారు. ప్రతి దశలోనూ రైతులకు పథకాలు అమలు చేస్తూ వ్యవసాయానికి తోడ్పాటునందిస్తున్నారు. రైతులు తీసుకున్న రుణాన్ని సక్రమంగా చెల్లించినందుకు వైఎస్సార్ సున్నా వడ్డీ పథకాన్ని రైతులకు అందిస్తున్నారు. అందులో భాగంగా రెండు విడతల వైఎస్సార్ సున్నా వడ్డీ సాయాన్ని ఈ నెల 28న రైతుల ఖాతాల్లో ప్రభుత్వం జమ చేయనుంది.

రెండు సీజన్ల వైఎస్సార్ సున్నా వడ్డీ రాయితీ

పంటపై రైతులు తీసుకున్న రుణాలపై సున్నా వడ్డీ రాయితీని ప్రభుత్వం జమ చేయనుంది. రెండు సీజన్లకు సంబంధించి సున్నా వడ్డీ రాయితీని ఈ నెల 28న జమ చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. 2021–22 ఆర్థిక సంవత్సరంలో దాళ్వా, అలాగే 2022–23 ఆర్థిక సంవత్సరంలో ఖరీఫ్‌కు సంబంధించిన సున్నా వడ్డీ రాయితీని రైతుల ఖాతాల్లో జమ చేయనున్నారు. రైతులు బ్యాంకుల నుంచి తీసుకున్న రుణాలను సక్రమంగా చెల్లించేలా, రైతులను ప్రోత్సహించడం, అదే సమయంలో వారికి వెన్నుదన్నుగా నిలబడేందుకు సున్నా వడ్డీ రాయితీని ప్రభుత్వం చెల్లిస్తోంది.

క్లస్టర్ పరిధిలో ఇలా..

మండపేట, రామచంద్రపురం నియోజకవర్గాల పరిధిలోని రామచంద్రపురం, కె.గంగవరం, రాయవరం, మండపేట, కపిలేశ్వరపురం మండలాల్లోని రైతులకు వైఎస్సార్ సున్నా వడ్డీ రాయితీని అందజేయనున్నారు. ఇప్పటికే మండల వ్యవసాయ కార్యాలయాలకు రైతులకు విడుదల కానున్న సున్నా వడ్డీ రాయితీ వివరాలు చేరుకున్నాయి. లబ్ధిదారుల వివరాలను మండల వ్యవసాయాధికారులు రైతు భరోసా కేంద్రాల్లో రైతులకు అందుబాటులో ఉంచారు. రెండు సీజన్లకు సంబంధించి క్లస్టర్ పరిధిలో 17,222 మంది రైతులకు రూ.2,32,65,296 లబ్ధి చేకూరనుంది. 2021–22 రబీకి సంబంధించి 1,687 మంది రైతులకు రూ.24,12,602 సున్నా వడ్డీ రాయితీని రైతులు పొందుతుండగా, 2022–23 ఖరీఫ్ పంటకు సంబంధించి 15,535 మంది రైతులకు రూ.2,08,52,694 వడ్డీ రాయితీని పొందనున్నారు. ప్రస్తుతం వరి పంట చిరుపొట్ట దశకు చేరుకుంటుంది. ఇప్పుడు ప్రభుత్వం ఇస్తున్న సున్నా వడ్డీ రాయితీ రైతులకు రబీ పంటకు పెట్టుబడి సాయంగా ఉపకరిస్తుంది. దీంతో రైతులు పెట్టుబడి కోసం దళారులపై ఆధారపడాల్సిన అవసరం ఉండదు. వైఎస్సార్ సున్నా వడ్డీ పథకం ద్వారా రామచంద్రపురం నియోజకవర్గంలో రబీ సాగులో 668 లబ్ధిదారులు రూ.7,80,389, ఖరీఫ్ సాగులో 8,374 మంది లబ్ధిదారులు రూ.10,628,252 లబ్ధి పొందారు. మండపేట నియోజకవర్గంలో రబీ సాగులో 1,019 మంది రైతులకు రూ.16, 32,123, ఖరీఫ్ సాగులో 7,161 మంది రూ.1,02,24,442 లబ్ధి పొందారు.

రైతులను ప్రోత్సహించేందుకే..



సక్రమంగా రుణాలు చెల్లించే రైతులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం వైఎస్సార్ సున్నా వడ్డీ పథకాన్ని అమలు చేస్తోంది. బ్యాంకుల నుంచి రుణాలు పొందిన రైతులు సక్రమంగా రుణాలు చెల్లించాలి. ప్రభుత్వం ఇస్తున్న సున్నా వడ్డీ రాయితీ రైతుల పెట్టుబడికి ఉపకరిస్తుంది.

– కొప్పిశెట్టి ప్రభాకర్, మండల వ్యవసాయాధికారి, రాయవరం

క్లస్టర్ పరిధిలో వైఎస్సార్ సున్నా వడ్డీ రాయితీ ఇలా..

మండలం	రైతులు	విడుదలైన సొమ్ము(రూ.ల్లో)
2021–22 ఏడాదికి రబీకి సంబంధించి..		
కపిలేశ్వరపురం	461	7,39,768
మండపేట	349	5,31,772
పామర్రు	371	4,23,720
రామచంద్రపురం	297	3,56,669
రాయవరం	209	3,60,673
మొత్తం	1,687	24,12,602
2022 ఖరీఫ్‌కి సంబంధించి..		
కపిలేశ్వరపురం	3,292	41,53,332
మండపేట	1,942	31,23,897
పామర్రు	4,553	54,57,511
రామచంద్రపురం	3,821	51,70,741
రాయవరం	1,927	29,47,213
మొత్తం	15,535	2,08,52,694

సంక్షేమ సారథి సీఎం జగన్


కోరుమిల్లి గడప గడపకూ మన ప్రభుత్వంలో ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు

ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు

కపిలేశ్వరపురం: సామాన్యుల సంక్షేమ సారథిగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దేశంలోనే గుర్తింపు పొందారని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అన్నారు. మండలంలోని కోరుమిల్లిలో సోమవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా గ్రామంలో పర్యటించారు. చిన కోరుమిల్లిలో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాల అమలు తీరును వివరించారు. సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు తమ పరిధిలోని నివాసితులకు ప్రభుత్వం అందించిన లబ్ధిని ఎమ్మెల్సీ తోటకు వివరించారు. గ్రామస్తులు ప్రస్తావించిన సమస్యలపై ఎంపీడీఓ ఎం.రామకృష్ణారెడ్డితో చర్చించి, పరిష్కరించాలని ఆదేశించారు. గ్రామంలో చేపట్టిన అభివృద్ధి పనులను కార్యదర్శి కామేశ్వరరావు, సచివాలయ ఉద్యోగులు వివరించారు. ఎమ్మెల్సీ తోట మాట్లాడుతూ గ్రామంలోని పేద, మధ్య తరగతి ప్రజలందరికీ ప్రభుత్వ లబ్ధి అందిందన్నారు. రానున్న ఎన్నికల్లో ఎవరికి ఓటెయ్యాలన్న విషయమై విజ్ఞతతో ఆలోచన చేయాలన్నారు. కల్లబొల్లి కబుర్లు చెప్పే ప్రతిపక్షాలకు ప్రజలే బుద్ధి చెప్పాలన్నారు. పార్టీ నాయకులు వేగుళ్ల పట్టాభిరామయ్య చౌదరి మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని స్థాయిలో పేదలకు సంక్షేమాన్ని అందించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ శీలం గోవింద్, గ్రామ కమిటీ అధ్యక్షుడు సలాది చిన్ని, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

వలంటీర్ వ్యవస్థతో పథకాల చేరువ

ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు


కోరుమిల్లిలో సచివాలయ ప్రారంభోత్సవంలో ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు

కపిలేశ్వరపురం: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రూపకల్పనలోని సచివాలయం, వలంటీర్ వ్యవస్థలతో గ్రామాల్లో పేద, మధ్య తరగతి ప్రజలకు పారదర్శకంగా సంక్షేమం అమలవుతోందని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అన్నారు. కోరుమిల్లిలో నిర్మించిన సచివాలయ భవనాన్ని సర్పంచ్ ఆచంట సత్యనారాయణ సమక్షంలో ఆయన ప్రారంభించారు. ఎమ్మెల్సీ తోట మాట్లాడుతూ ప్రపంచాన్ని కుదిపేసిన కరోనా విపత్కర పరిస్థితుల్లో సైతం ఆంధ్ర ప్రదేశ్‌లో ఏ ఒక్క పథకమూ ఆపకుండా పేదల పక్షాన పాలన సాగిందన్నారు. సచివాలయ వ్యవస్థ పటిష్టతకు సొంత భవనాలు దోహదపడతాయన్నారు. కోరుమిల్లి గ్రామం తనకు రాజకీయ జీవితం ఇచ్చిందని, గ్రామాభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికలు అత్యంత కీలకమని, సంక్షేమ పాలన అందిస్తున్న వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి మరోసారి అధికారాన్ని ఇవ్వాల్సిన అవసరాన్ని అందరూ గుర్తించాలన్నారు. రానున్న ఎన్నికల్లో తనకు పూర్తి సహకారాన్ని అందించాలని ఆశిస్తున్నానన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సుంకర వెంకటేశ్వరరావు, ఎంపీడీఓ ఎం.రామకృష్ణారెడ్డి, కార్యదర్శి కామేశ్వరరావు, వైఎస్సార్ సీపీ యువనేత తోట పృథ్వీరాజ్, జెడ్పీటీసీ పుట్టపూడి అబ్బు, ఎంపీపీ మేడిశెట్టి సత్యవేణి, పీఏసీఎస్ చైర్మన్ ఆచంట వీవీ స్వామి, నాయకులు సలాది వీరబాబు, సలాది అప్పారావు, ఉంగరాలు రాజు, పేరాబత్తుల రామకృష్ణ, పేరాబత్తుల శివశంకర్, వింటి సత్తిబాబు, సుంకర మూలాస్వామి, సిరిపురపు శ్రీనివాసరావు, నక్కా సింహాచలం పాల్గొన్నారు.

సీఎం జగన్‌తో పారదర్శక పాలన


రత్నంపేటలో పథకాల గురించి వివరిస్తున్న వైఎస్సార్ సీపీ కో ఆర్డినేటర్ సూర్యప్రకాశ్

- వైఎస్సార్ సీపీ కో ఆర్డినేటర్ సూర్యప్రకాశ్
- పట్టణంలో గడప గడపకూ..

రామచంద్రపురం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో రాష్ట్రంలో ఆదర్శవంతమైన పాలన సాగుతుందని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ పిల్లి సూర్యప్రకాశ్ అన్నారు. స్థానిక 21వ వార్డు రత్నంపేటలో సోమవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు చేరాలనే లక్ష్యంతో ప్రభుత్వం పారదర్శకంగా పథకాలను అందిస్తుందన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా అర్హుల ఇంటికే పథకాల లబ్ధి చేరుతుందన్నారు. గతంలో ప్రభుత్వ పథకాలు అందాలంటే కార్యాలయాలు, జన్మభూమి కమిటీల చుట్టూ తిరగాల్సి వచ్చేదన్నారు. ఇప్పుడు ఎటువంటి ఇబ్బందులు లేకుండా వలంటీర్ వ్యవస్థ ద్వారా పథకాలు అందిస్తున్నారని వివరించారు. ఏ రాష్ట్రంలో లేని విధంగా వైద్య, ఆరోగ్య రంగాలకు సీఎం జగన్ అధిక ప్రాధాన్యం ఇస్తున్నారన్నారు. తిరిగి పేదలకు సంక్షేమ పథకాలు అందాలంటే తిరిగి జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రి చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అనంతరం ఆయా పథకాలు లబ్ధిదారులకు అందుతున్న తీరును సూర్యప్రకాశ్ అడిగి తెలుసుకున్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ గాధంశెట్టి శ్రీదేవి, వైస్ చైర్మన్ కోలమూరి శివాజీ, ది ఆర్యాపురం కోఆపరేటివ్ బ్యాంకు డైరెక్టర్ మల్లిడి సాయిలక్ష్మి, కౌన్సిలర్‌లు వాడ్రేవు సాయిప్రసాద్, పట్టణ పార్టీ కన్వీనర్ గాధంశెట్టి శ్రీధర్, విలియమ్స్ తదితరులు పాల్గొన్నారు.

పగలు వేడిగా.. రాత్రి చలిగా


గొల్లపాలెంలో ఉదయం 8 గంటలకు వీడని మంచు తెర

కాజులూరు: తొలిసంధ్య వేళలో మంచు వర్షం.. ఆ తరువాత భానుడి ఉగ్ర ప్రతాపం.. మలిసంధ్య కాగానే మరళా చలి పులి. ఇలా విభిన్న వాతావరణంతో కొద్దిరోజులుగా ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. నిన్న, మొన్నటి వరకూ చలి గుప్పెట్లో అల్లాడిన ప్రజలకు ఒక్కసారిగా పగటి ఉష్ణోగ్రతలు పెరగటంతో ఇబ్బందులకు గురవుతున్నారు. రానున్న వేసవికి ఈ వాతావరణం సూచిస్తుంది. కాజులూరు మండల గ్రామాల్లో రాత్రుళ్లు చలితో పాటు ఉదయం ఎనిమిది గంటల వరకూ మంచు తెరలు వీడడం లేదు. 10 గంటల నుంచి భానుడు ఉగ్ర రూపాన్ని చూపుతున్నాడు. రథసప్తమి రోజున సూర్య భగవానుడు కొత్త రథాలను సిద్ధం చేసుకుని తన పయనాన్ని ప్రారంభిస్తాడని, ఆ రోజు నుంచే వేసవి ప్రారంభమౌతుందని హైందవ భక్తుల నమ్మకం. దానికనుగుణంగానే వేసవికాలం వచ్చిందంటూ ప్రజలు చర్చించుకుంటున్నారు. రాత్రిళ్లు చలి, ఉదయం మంచు తగ్గకపోవటంతో రోగాలు సోకుతున్నాయని పలువురు చెబుతున్నారు. ఈ వాతావరణంతో పంటలపై పలు తెగుళ్లు వ్యాపిస్తున్నాయని రైతులు వాపోతున్నారు.

వృద్ధులకు అన్న సమారాధన

రాయవరం: పసలపూడి గ్రామంలో ప్రశాంతి వృద్ధాశ్రమంలో సోమవారం ఘనంగా అన్న సమారాధన చేపట్టారు. రామచంద్రపురం పట్టణ వాకర్స్ క్లబ్ గౌరవ అధ్యక్షులు తొగరు మూర్తి, మద్దిపూడి శ్రీనివాస్, కల్యాణి దంపతుల ఆధ్వర్యంలో వృద్ధులకు అన్న సమారాధన, మెడిటేషన్ తరగతులు నిర్వహించారు. అన్న సమారాధనతో పాటు, ఆశ్రమంలో ఉన్న గోవులకు దాణాను అందజేశారు.

టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలో చేరిక


మండపేటలో పార్టీలో చేరిన యువకులతో తోట పృథ్వీరాజ్

కపిలేశ్వరపురం (మండపేట): మండపేట పట్టణం ఆరో వార్డులోని 30 మంది టీడీపీకి చెందిన యువకులు ఆ పార్టీని వీడి వైఎస్సార్ సీపీలో చేరారు. కోళ్ల శ్రీను ఆధ్వర్యంలోని యువకులు సోమవారం మండపేట ఎమ్మెల్సీ క్యాంపు కార్యాలయంలో వైఎస్సార్ సీపీ యువనేత తోట పృథ్వీరాజ్ సమక్షంలో పార్టీలో చేరారు. వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదలకు అమలు చేస్తున్న సంక్షేమ పాలన, నియోజకవర్గ అభివృద్ధికి ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు చేస్తున్న కృషికి ఆకర్షితులై పార్టీలో చేరినట్టు కోళ్ల శ్రీను తెలిపారు. పార్టీలో చేరిన వారిలో వెంకటదుర్గ, కె.అప్పలనాయుడు, అరుణ్ కుమార్, ఎంఎం కృష్ణ, కె.శివ, అడపా నాగరాజు, ఎం.కృష్ణ, టి.హరిబాబు, పి.రాజు, ఎం.సత్యనారాయణ, ఉంగరాల సత్యనారాయణ ఉన్నారు.

వైఎస్సార్ సీపీలోకి సలాది చిన్ని


సలాది చిన్నితో ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు

కపిలేశ్వరపురం: కోరుమిల్లికి చెందిన జనసేన కీలక నేతలు రెండు రోజులుగా వైఎస్సార్ సీపీలో చేరడం చర్చనీయాంశంగా మారింది. తాజాగా గ్రామంలోని కీలక నేత సలాది పట్టాభి రామయ్య (చిన్ని) సోమవారం ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. ఆయనకు పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. నాయకుల సమక్షంలో చిన్నిని పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షునిగా ప్రకటించారు. పార్టీ పటిష్టతకు కృషి చేస్తానని, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు వెంట నడుస్తానని చిన్ని పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు వేగుళ్ల పట్టాభి రామయ్య చౌదరి మాట్లాడుతూ పార్టీ గెలుపే లక్ష్యంగా సమన్వయంతో పనిచేయాలన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ శీలం గోవిందు, పీఏసీఎస్ చైర్మన్ ఆచంట వీవీ స్వామి, పేరాబత్తుల రామకృష్ణ పాల్గొన్నారు.

వాడపల్లి వెంకన్నకు పూజలు

ఆత్రేయపురం: కోనసీమ తిరుపతిగా ఖ్యాతికెక్కిన వాడపల్లి శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంలో సోమవారం స్వామి వారికి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఏడు శనివారాల నోము ఆచరించిన భక్తులు తమ మొక్కుబడులు చెల్లించుకునేందుకు అష్టోత్తర పూజా కార్యక్రమాల్లో పాల్గొంటారు. ఉదయం స్వామి వారికి సుప్రభాత సేవ, నీరాజన మంత్రపుష్పం, పుణ్యహవచనం తదితర పూజా కార్యక్రమాలు ఆలయ అర్చకులు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ అవరణలో స్వామి వారి అన్నసమారాధన నిర్వహించారు. ఏర్పాట్లను ఆలయ కమిటీ చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, ఆలయ ఈఓ ముదునూరి సత్యనారాయణరాజు ఆధ్వర్యంలో ఆలయ కమిటీ సభ్యులు, ఆలయ సిబ్బంది పర్యవేక్షించారు.

నూతన కార్యవర్గం ఎన్నిక


డానియల్ పాల్‌ను మర్యాదపూర్వకంగా కలుసుకున్న నూతన కార్యవర్గ ప్రతినిధులు

కె.గంగవరం: మండల పాస్టర్స్ ఫెలోషిప్ నూతన కార్యవర్గ ఎన్నిక కె.గంగవరంలో సోమవారం జరిగింది. సంఘ మండల అధ్యక్షుడిగా పి.ఆశీర్వాదం, కార్యదర్శిగా కె.ఆశీర్వాదం, కోశాధికారిగా ఎం.దొరబాబు, ఉపాధ్యక్షుడిగా టి.డానియేల్ రాజు, సంయుక్త కార్యదర్శిగా వి.రవిబాబులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గాన్ని జిల్లా అధ్యక్షుడు డాక్టర్ బిషప్ డానియల్ పాల్, ఎగ్జిక్యూటివ్ మెంబర్ కె.ఫిలప్‌రాజు, మండలంలోని పాస్టర్లు అభినందించారు.

ఓటు హక్కుతో ప్రజాస్వామ్యం బలోపేతం


సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ కృష్ణారావు

రాయవరం: త్వరలో జరగనున్న సాధారణ ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని, తద్వారా ప్రజాస్వామ్యం బలోపేతమవుతుందని తహసీల్దార్ ఆర్‌వీ కృష్ణారావు అన్నారు. రాయవరంలోని వైఎస్సార్ క్రాంతిపథం కార్యాలయంలో సోమవారం ఓటు హక్కు వినియోగంపై అవగాహన సదస్సు నిర్వహించారు. తహసీల్దార్ కృష్ణారావు మాట్లాడుతూ ఓటు హక్కు వజ్రాయుధం వంటిదన్నారు. ప్రతిఒక్కరూ ఓటు హక్కును సద్వినియోగం చేసుకున్నప్పుడే ప్రజాస్వామ్యం పరిఢవిల్లుతుందన్నారు. ఓటు హక్కును నిజాయితీగా, నిర్భయంగా వినియోగించుకోవాలన్నారు. ఎటువంటి ప్రలోభాలకు లోనుకాకుండా ఓటు హక్కు వినియోగించుకోవాల్సిన అవసరం ప్రతిఒక్కరిపై ఉందన్నారు. ప్రతి పోలింగ్ స్టేషన్ వద్ద ఓటర్లు నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకునే పరిస్థితులను ఎన్నికల కమిషన్ కల్పిస్తుందన్నారు. సమావేశంలో ఆర్‌ఐ పంపన రామారావు, వైఎస్సార్ క్రాంతి పథం ఏపీఎం షేక్ నాజర్ తదితరులు పాల్గొన్నారు.

ద్రాక్షారామ యువకుడికి అభినందన


త్రివేథ్ నాయుడిని అభినందిస్తున్న సీఐ దొరరాజు, ఎస్సై సురేంద్రబాబు

రామచంద్రపురం రూరల్: ద్రాక్షారామకు చెందిన యువకుడు ఉప్పు త్రివేథ్ నాయుడు ఇంటర్నేషనల్ మోడల్‌గా గుర్తింపు పొందాడు. ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన యష్ ఇంటర్నేషనల్ కాంటెస్ట్‌లో పాల్గొన్న అతను స్టైలిష్ ఐకాన్ టైటిల్‌ను గెలుచుకోవడంతో పాటు ఇంటర్నేషనల్ మోడల్‌గా రాణిస్తున్నాడు. ఆ యువకుడు చెవిటి, మూగ అయినా రాణించడంపై ద్రాక్షారామ పోలీస్ స్టేషన్‌లో సీఐ దొరరాజు, ఎస్సై సురేంద్రబాబు అభినందించారు. త్రివేథ్ నాయుడు స్నేహితులు ర్యాలి విద్యాసాగర్, నున్న ఆదిసాయి, కశ్లేపల్లి గణేష్, నూకల రాజేష్, మాకినేడి ఆంజనేయులు, బబ్లు తదితరులు స్థానిక బోస్ బొమ్మ సెంటర్‌లో కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. సర్పంచ్ కొత్తపల్లి అరుణ, ఉప సర్పంచ్ పెన్నాడు బుచ్చిరాజు, వైస్ ఎంపీపీ నరాల రాజ్యలక్ష్మి, ఎంపీటీసీ నున్న సత్యవతి తదితరులు అభినందనలు తెలిపారు.